సరోజిని

శ్రీ కొండముది శ్రీరామచంద్రమూర్తి

ఏటిపాయనుండి నీరు తెచ్చుకుంటున్న ఆ పల్లెపడుచు వీధి మధ్య దాకా వచ్చి, అనాలోచితంగా నే ప్రక్కకు పరికించి, ఒక్కసారిగా కళవళపడి, భయోద్వేగాల భారం మూలంగా చంకనున్న కడవ జారవిడిచి, ఆసరాకు ప్రక్కనున్న పిట్టగోడ నానుకున్నది.

"ఏమిటీ వైపరీత్యం? మానవ దేహాలింత అశాశ్వతాలా?"

ఆమె హృదయంలో ఎక్కడో, ఏదో అశాంతి ...ఏదో శూన్యభావం. బాధ నోర్చుకోలేని ఆమె హృదయం గొంతులోనికి వచ్చి కొట్టాడుకున్నది. ఆమె నేత్రాలు బాష్పబిందువుల నింపుకొని మసక తెరలచాటునుండి ఎదుటి దృశ్యంలోని ఆ దీనత్వాన్నీ, వేదననూ దర్శించడం మొదలు పెట్టినవి.

"నిన్నటివరకూ తా మిద్దరూ కలసిమెలసి బ్రతికారు. ఒకేసారి కాపురానికి వెళ్లారు. బిడ్డలను వొకేసారి చంక నెత్తుకున్నారు. కల్గినదాంతో తృప్తిపడి, మధ్యాహ్న సమయాల్లో వైకుంఠపాళీ ఆడుకుంటూ—సాయంకాలం తీరిగ్గా కూచుని సరదాకు తగవులాడుకుంటూ తమ తమ కుటుంబ విషయాలు అరమరిక లేక ముచ్చటించుకుంటూ ప్రొద్దుపుచ్చేవారు. అయ్యో! స...రో...జి...నీ!"

చీర కొంగుతో కండ్లు తుడుచుకుని, మెల్లగా అడుగులు వేసుకుంటూ ఎదుటనున్న మండువా లోగిట్లోకి ప్రవేశించబోయి, అడ్డువచ్చిన ఆ పసుల కాపరులను చూచి క్షణంసేపు అట్టే నిల్చున్నది.

సూర్యోదయాత్పూర్వమే, పశువులను పొలాలకు తోలుకు వెళ్తున్న ఆ పల్లెపిల్లలు ఆ యింటిముందు మూగిన జనాన్ని, ఒక్క లిప్తకాలం ఆగి పరిశీలనగా చూచి తిరిగి తమ కది సంబంధించిన విషయం కాదన్నట్లుగా, మహిపారూఢులై ముందుకు సాగిపోయారు.

వారు తనను దాటిపోయిన తదుపరి భారంగా అడుగులు వేస్తూ, మండువాలోని అరుగులను సమీపించిందామె. అరుగులమీద జనం ఎవరూ లేరు. ఓ పసిపిల్లవాడు మాత్రం, ఓ మూలగా కూచుని, దిగాలుగా, కదిలిమెదిలే ప్రపంచంలోని ఈ నీడలతో సంబంధం లేదన్నట్లుగా, కన్నీరు కార్చడానికైనా వోపిక లేదన్నట్లుగా వున్నాడు. అప్పుడప్పుడే ఎళ్లబారుతున్న సూర్యకిరణాల్లో, తైలసంస్కారంలేని అతని జుట్టు మొహంమీదకు పడి ఫాలతలాన్ని కప్పివేస్తున్నది. అతని పెదవులు కదలాడుతున్నా, మాటలు నోట్లోనుంచి బయటకు రావడంలేదు. అతని వంటిమీదనున్న ఆ మాసిన దుస్తులు ఎప్పుడు ధరించినవో!

ఆమె అతనిని సమీపించింది. అతనిని చూచి నిశ్చేష్టయై నిలచింది. "ఇదేమిటి? రఘు—రఘు కాదూ వీడూ?"

ఆమెలోని మాతృత్వం తెరలను తొలగించుకున్నది. హృదయం విశాలమై వెలిగింది. కండ్లలో అశ్రుకణాలు ..పెదిమలు తడబడినవి. ఆమె వదనం సంపూర్ణంగా చలించింది. "బాబూ!" అంటూ ఒక్కసారిగా చేతులు చాచి ఆ పిల్లవాణ్ని సందిట పొదువుకున్నది.

కానీ—ఆపిల్లవాడు మాట్లాడలేదు. కండ్లు తెరిచి ఎదుటి వ్యక్తిని గమనించలేదు. మరు మాటాడకుండా ఆమె సందిటనొదిగి, ఆమె చీరచాటున వేదనను దాచుకున్నాడు. ఆమె అతని జుట్టులోకి వ్రేళ్ళుపోనిచ్చి ప్రేమగా సవరించి "బాబూ! రఘూ!" అంటూ దుఃఖాన్నాపుకోలేక కన్నీటితో అతని మూర్ధాన్నభిషేకించింది.

మొహంమీదపడ్డ కన్నీటిచుక్కల నతడు తుడుచుకోనే లేదు. ఆమె వేదనలో పాలు పంచుకుని దుఃఖాశ్రువులు రాల్చలేదు. ఒక్క నిట్టూర్పు మాత్ర మతని

నుండి వెలువడింది. ఆమె అతనిని చూచింది. ఆశ్చర్యపడింది. ఒక్క అడుగు వెనక్కు వేసింది. తిరిగీ అతని వేపు నిశితంగా చూచింది. సమాధిలోనున్న యోగివలె మౌనముద్రాలంకృతుడై, అంతర్ముఖావలోకనం చేసుకుంటున్నాడతడు.

ఆమె కేవిషయమే అంతుబట్టలేదు. "ఈ పసివాడు ప్రేక్షకుల హృదయాలు ద్రవించేటట్లు బిగ్గరగా దుఃఖించడేం?"

ఆమెలోని అహం కొద్దిగా దెబ్బతిన్నది. తన వేదనకన్న, ఈకుఱ్ఱవాడి మౌనం, ఎక్కువ బాధను తెల్పుతుందన్న సత్యం ఆమెగ్రహించలేక, ఆకుఱ్ఱవాడి వేపు ఒక్కసారి దయగా, జాలిగా చూచి ముందుకు-జనం గుమిగూడినచోటికి వెళ్ళింది.

ఆదృశ్యం — చూడలేక — మొహానికి చేతుల నడ్డంపెట్టుకున్నది. చీరచెరగు మెడచుట్టూ తిప్పుకుని మొహం మీదకు లాక్కున్నది. కానీ స్పష్టాతి స్పష్టంగా ఆదృశ్యం, హృదయవిదారకమైన ఆదృశ్యం కనిపిస్తూ నేవున్నది. బాహ్యేంద్రియాలతోపాటు అంతరింద్రియాలుకూడా అనిమిషులై పనిచేస్తూ—ఆ దృశ్యాన్ని దర్శిస్తూనే వున్నవి. ఎంత హృదయ విదారకమైన దృశ్యమది!

పచ్చని సూర్యకిరణాల్లో పసుపు పచ్చని ఆమె వదనం మరింతగా వెలుగుతున్నది. జీవరహితమైనా జీవకళలను నింపుకొన్నట్లుగావున్నది. గోడవారకు ఆనించిన ఆమెదేహం—తనను చూచి దుఃఖిస్తున్న వారిని పరిహసిస్తున్నట్లుగా వున్నది.

అతను బ్రాహ్మణుల మంత్రాలతో యాంత్రికంగా కర్మవిధులను నెరవేరుస్తున్నాడు. ఆమెకు సచేలస్నానం చేయిస్తున్నాడు. "అయ్యో సరోజినీ!"

అతనిలో చైతన్యంలేదు. కన్నీళ్ళులేవు. ఆలోచన లేదు. లేవు! లేవు! ఏమీలేవు అతనిలో!

పుణ్యస్త్రీలందరూ సరోజినిని చూస్తున్నారు. 'అదృష్టవంతురా' లని కళ్ళు తుడుచుకుంటున్నారు. అదృష్టవంతురాలు?

పుణ్యపురుషులందరూ సరోజినిని చూచి జాలి పడుతున్నారు. పాపమని నిట్టూర్పులు విడుస్తున్నారు. అతని దురదృష్టానికి దేవుణ్ణి దూషిస్తున్నారు.

చనిపోయిన సరోజినికిని వినిపించడంలేదు. బ్రతికివున్న జగన్నాథానికి అంతకన్నా వినిపించడం లేదు.

సరోజిని తనను చూచి నవ్వుతున్నట్లే వున్నదతనికి. తలస్నానం మూలంగా రేఖామాత్రంగా కనిపిస్తున్న తన అవయవాలను చూచి సిగ్గుతో కుంచించుకుపోతున్నట్లేవున్నదతనికి. నలుగురుబిడ్డల తల్లి సరోజిని సంసార భారాన్ని వహిస్తానని తన కభయమిస్తున్నట్లే వున్నదతనికి.

అతని దృష్టిలో సరోజిని బ్రతికేవున్నది!

సరోజినికి చావులేదు!

ఆ దృశ్యం చూడలేక వచ్చిన ఆ పల్లె పడుచు వసారా మీదకు దృష్టిమళ్ళించింది. అక్కడి ఆదృశ్యం—ఆ కాసేపూ ఆ స్థలం శోకదేవతకు ఆలవాలమైనట్లనిపించింది.

ఆరో నెల దాటని పసిగుడ్డు పాలకోసం అదేపనిగా గుక్కపట్టి ఏడుస్తున్నది. మూడోసంవత్సరమైనా నిండని రాముడు ఆకలితో అలమటించి పోతున్నాడు. ఇక కమల సరేసరి ఏడ్చే ఓపికకూడా లేక జరుగుతున్న తతంగం అర్థంకాక, కళ్ళుతెరుచుకునే శోషతో చాపకు ఓమూలకు చుట్టచుట్టుకొని పడుకొనివున్నది.

అక్కడవున్న జనానికి ఈపసివారి గోల వినిపించడంలేదు. జగన్నాథాన్ని పరామర్శించడంలో వున్న శ్రద్ధ ఆ పసిపిల్లలకింత ఆధరువు చూపించాలన్న విషయంలో లేదు.

ఆమె కిదంతా విచిత్రంగా కన్పించింది. త్వరత్వరగా ముందుకు రెండడుగులువేసి, ఆ పసిదాన్ని చంక నెత్తుకుని రొమ్మునందించింది, పమిటి చెంగు చాటుచేసుకుని. ఆ పసిదాన్ని బ్రతికించింది.

వసారాలో మూలగావున్న బల్లమీద కూచుని, పసిదానికి పాలుపడుతున్న ఆమెకు గడప దగ్గరగా కూచున్న వయోవృద్ధులైన ఆడవాళ్లు కొందరు కన్పించారు. గుమ్మానికి ఆనుకునివున్న వాళ్లు పార్వతమ్మ గారిని సముదాయిస్తున్నారు.

పాలు సరిగా అందక బాధపడుతున్న ఆ పసిదానికి, రొమ్ము సరిగా అందిస్తున్న ఆమెకు వాళ్లమాటలు కొన్ని ధ్వనిమాత్రంగా విన్పించాయి. "పెద్దదానివి నువ్వే ఇట్లా అధైర్యపడితే ఎలా చెప్పు? ఆ పసివాళ్ల

గతేం కాను? తమ్ముడు చూడు ఏలావున్నాడో! కూతురు పోయిందనే దుఃఖపడుతూ కూచుంటే, ఆ తమ్ముడిగతి ఎవరు చూచేను? ఒకరికొకరు అండగా నుండవలసినవాళ్లు."

పార్వతమ్మ జవాబుచెప్పలేదు. తలదించుకొని, దిగులుగా, మౌనంగా, కన్నీళ్ళుకారుస్తూ వుండిపోయింది.

వాళ్ళింకా చెప్పుకుపోతూనే వున్నారు. తమ్ముడికి బిడ్డనిచ్చి పెళ్లిచేశావు. బాగానే వున్నది. కానీ ఇట్లా అవుతుందని నువ్వుమాత్రం కలగన్నావా? ఆ పసివాళ్లు నలుగురూ నువ్విట్లా ఉపేక్షాభావంతో, నిర్లక్ష్యంతో దుఃఖిస్తూ పడివుంటే ఏమై పోతారు? ఆలోచించు పార్వతమ్మా—నలుగురికి చెప్పదగిన దానివి, నువ్వే ఇలా అధైర్యపడితే!—

చెబుతున్న దెవరా అని పిల్లకు పాలిస్తున్న ఆపల్లెపడుచు ముందుకు రెండడుగులు వేసి ఇంట్లోకి తొంగి చూచింది. ఇంకెవరు? సాక్షాత్తూ తన అత్తగారు! ఆమె తన నిప్పుకు ఇక్కడచూస్తే ఇంకేమైనా వుందా?

గాభరాగా ఆపసిదాన్నక్కడ దింపి, తడబడు తున్న అడుగులతో, ఆ జనసమూహాన్ని తప్పించుకుంటూ వీధిలోకివెళ్లి, క్రిందపడివున్న కడవను చంకకెత్తుకుని తిరిగీ ఏటివేపు నడకసాగించింది, మనసులో ఇష్టంలేకపోయినా ఆ పల్లెపడుచు. నిండీ నిండని కడుపు మూలంగా బాధ మిక్కుటమై మళ్లీ ఆ పసిది గొడవచేయడం ప్రారంభించింది.

నాలు గ్గోడలమధ్యా జీవితాలను గడుపుతూ, ప్రపంచంలోని అనుభవాన్నంతా మూటగట్టుకొంటున్న ఆ పుణ్య స్త్రీలు తమ లోకంలో తాము మాట్లాడుకొంటూ పార్వతమ్మను సముదాయిస్తున్నారు.

బ్రాహ్మణులు తమ మంత్రాలను పూర్తి చేసుకుంటూ, నిరుపయోగమైన ఆ కట్టెనిక శ్మశానస్థలికి గొనిపోవచ్చునంటూ జగన్నాధానికి అనుజ్ఞ యిస్తున్నారు.

ప్రపంచంలో యధాప్రకారం విధినిర్వహణ జరిగి పోతూనేవున్నది. కన్నీళ్ళూ, ఆనందాలూ అన్నీ ప్రక్క ప్రక్కనే ప్రయాణం సాగిస్తూనే వున్నవి.

* * * *

ఈ లోకంలో లేకుండా పడివున్న పార్వతమ్మ, కొంత సేపటికి తనకుతానే దిటవు తెచ్చుకుని బయటికి వచ్చి పరిస్థితి నవలోకించింది. మిగిలినదేమున్నది?

గోడుగోడున అలమటిస్తున్న పసిపిల్లలు—శవవాహనానికై అయిష్టంగానే ఏర్పాట్లు సాగిస్తున్న జగన్నాధం—కళ్ళు తుడుచుకుంటున్న వూరిప్రజలు: ఆమె కంట్లుకూడా ఆర్ద్రాలయినవి. హృదయం చిక్కబట్టినట్లైంది. దేహంలో నిస్సత్తువ...ఇంద్రియాలకు స్వేచ్ఛ లభించినట్లైంది. మెల్లగా ఆమె ఆ పసివాణ్ణి చంకనిడుకొని మిగిలిన పసివారిద్దరనీ చేతబుచ్చుకొని వంటింట్లోకి నడిచింది కాసిని పాలైనా పడదామని. కానీ అప్పటికే పిల్లివొకటి సంతుష్టిగా కళ్ళ నార్పుకుంటూ వంటింట్లోనుంచి బయటకు వస్తున్నది. పార్వతమ్మ నిస్సహాయఐంది. పిల్లలవైపు బాధగా, బరువుగా చూచింది. చేసేది లేక చంటిదాన్ని గుండె కదుముకొని నిట్టూర్చింది.

ఆమె పరిస్థితి నర్థంచేసుకున్న పొరుగింటి యిల్లాలొకామె ఆ పిల్లలకై చేయిచాపింది. మౌనంగానే పార్వతమ్మ ఆ పిల్లలను తన కందీయడంతో, వారిని చేత బుచ్చుకొని తన యింటివేపు నడిచి వెళ్ళింది. వెళ్తున్న ఆ యిల్లాలిని చూచి పార్వతమ్మ హృదయం ఆమెకు తెలియకనే తేలికపడినట్లైంది. తడియారని కళ్ళతో ఆ యిల్లాలినీ, తన పిల్లలనూ మనసులోనే మెల్లగా దీవించింది.

దీవించిన ఆ కళ్లతోనే మళ్ళీ తమ్ముడి వేపుకు దృష్టి పోనిచ్చింది. తమ్ముడిని చూచిన ఆమె హృదయంలో మళ్ళీ దిగులు రగిలింది. తెలియని బాధ ఆమెను నిలువెల్లా ఆక్రమించుకున్నది. "వెఱ్ఱివాడు! ఈ వయసులో వాడి కెన్నికష్టాలు!"

పార్వతమ్మ తలపులు ఒక కొలికికి రాకముందే నలుగురూ వొక్కుమ్మడి చేస్తున్న శబ్దాలు ఆమెను బాహ్యంలోనికి తీసుకుని వచ్చి ఆమె చూడలేని దృశ్యాన్ని ఆమెకు చూపించాయి.

తమ్ముడు, అగ్నిని చేత బుచ్చుకుని దిగాలుగా, జీవచ్ఛవంలా, నుంచున్నాడు. నలుగురుబ్రాహ్మణులు-సరోజినిని తమ బుజాల పైకి ఎత్తుకుంటున్నారు.

'.అయ్యో! సరోజినీ!"

పార్వతమ్మ హృదయం, హృదయంలో లేదు. ఆమె, పంచ ప్రాణాలూ, ఒకటై ఆమెనుండి శాశ్వతంగా సెలవు పుచ్చుకొనడానికి సిద్ధపడుతున్నట్లని పిస్తున్నవి. ఒక్కసారిగా ఆమె చలించిపోయి "అమ్మా! సరోజినీ!—తమ్ముడూ!" అంటూ వికృతంగా ఒక్క కేక పెట్టి ఆ బ్రాహ్మణుల కాళ్ళకు అడ్డంపడింది.

పైన ఆకాశంలో వున్న సూర్యుడు, సహస్ర కరాలతో ప్రపంచానికి రక్షణ కల్పిస్తున్నాడు. మధ్య మధ్యలోమాత్రం నిస్సహాయంగా మబ్బు ముసుగులు మొహానికి కప్పుకుంటున్నాడు. పార్వతమ్మకు మన స్పృహ లేదు. జగన్నాథానికి ఈ లోకం లేదు.

నలుగురు ఆడవాళ్లు బలవంతంగా, పార్వతమ్మను అక్కడినుంచి వసారాలోకి తీసుకునిపోయారు.

జగన్నాథం వీధిలోకి వచ్చాడు. శవవాహకులు రెండడుగులు ముందుకు వేశారు.

ఇంతలోకి పిల్లలను తీసుకువెళ్లిన ఆ పొరుగింటి యిల్లాలు, ముగ్గురు పిల్లలనూ తీసుకువచ్చింది. చంటి పిల్లచేత, సరోజినికి పాదాభివందనం చేయించింది. పెద్దదానిచేత తల్లినొసటిని కుంకుమ పెట్టించి, నమస్కారం చేయించింది. రాముడికి వాళ్లిమ్మను ఒక్కసారి చూపించి తిరిగి ఇంట్లోకి తీసుకుని వెళ్లింది.

జగన్నాథం ముందుకు సాగిపోతున్నాడు. శవవాహకులు భారంగా అడుగులు వేసుకుంటూ అరుగులదాకా వచ్చారు. ఇంతలో, పదేండ్లుదాటని ఓచిన్న కుఱ్ఱవాడు వాళ్ళను సమీపించి, మౌనంగా వాళ్ళకెదురుగా నిలబడి, కళ్లుమూసుకుని, నమస్కారం చేసి, మాట్లాడకుండా తన స్థానంలోకి వెళ్లి కూచున్నాడు.

తోచినవారు సరోజిని దేహంమీద పూలు చల్లారు. పెద్దమనుష్యులు పిల్లల భవిష్యత్తును గూర్చి చర్చించుకొన్నారు. ఆడవారూ, మగవారూ కలిసి ఏకగ్రీవంగా ఆ కుటుంబానికి సంబంధించిన విపత్తుకు విచారించారు.

కానీ ఎవరూ గూడా తమననుసరించి, తమ మాటలు వింటూ వస్తున్న ఓ పదేళ్ల కుఱ్ఱవాణ్ని గమనించలేదు.

*   *   *   *

కాలచక్రం వొకరి ప్రమేయం లేకుండా తనంతటతాను కొత్తదుస్తులు తొడుక్కుంటున్నది. సూర్యుడు కొత్తరంగులు పులుముకుంటున్నాడు. అపరాహ్ణం దాటి, సాయంత్రంలోని ప్రథమాంకం గడిచిపోవస్తున్నది. చల్లని ఏటిగాలి మెలమెల్లగా వీస్తున్నది. ప్రపంచంలో ఆనందానికి అంకురార్పణ జరగడానికి ఏర్పాట్లు త్వరితగతిని సాగిపోతున్నవి.

జగన్నాథం—భార్యకు శాశ్వతంగా వీడ్కోలు చెప్పినాడు. దుఃఖాశ్రులతోనే ఆమెకు వీడ్కోలు చెప్పి, తోడివారితో కలిసి ఏటిపాయ దగ్గరకు వెళ్ళాడు, ధౌతవస్త్రధారుడగుటకై. పదేండ్లు దాటని రఘు, శ్మశానస్థలి ప్రక్కగా నున్న నడిరోడ్డుమీద నిలబడి, మంటల్లో తన రూపాన్ని తనే హరించుకొంటూ తనను చూచి మందస్మితంలో ఆశీర్వదిస్తున్న తన తల్లికి తుదినమస్కారం పెట్టి, కళ్ళు తుడుచుకుంటూనే వెనుకకు తిరిగాడు. కొద్దిదూరమైనా నడవకముందే, కపాలమోక్షమయిన శబ్దం అతనికి స్పష్టంగా వినిపించింది.

అతను వెనుకకు తిరిగి చూడలేదు. తడబడుతున్న అడుగులతో, అలాగే, ఇంటివేపు నడక సాగించాడు.

ఇంటివద్ద పార్వతమ్మ పరిస్థితి కొంతలో కొంత మెరుగ్గావుంది. ఒక్కరొక్కరే మెల్లమెల్లగా సర్దుకున్నతర్వాత, నిస్సహాయంగా వున్న తనకు తానే ధైర్యం చెప్పుకొని, లేచి, చాకలివాడిచేత ఆ ప్రదేశాన్నంతా వూడ్పించి, నడియింట్లో చిన్న దీపమొకటి వెలిగింపజేసింది.

ఎవరో పుణ్యాత్ములు వంటయింట్లో భోజనాలకు ఏర్పాట్లు చేయిస్తున్నారు. పార్వతమ్మ, చాకలివాడిని పంపించివేసి, తనుకూడా స్నానంచేసి, కలఘుండువడిపోతున్న హృదయంతోనే, వీధి వాకిట్లోకి వచ్చి, ఓ బల్లమీద తమ్ముడికోసం ఎదురు చూస్తూ కూచున్నది.

ఎదురుగ్గావున్న రాళ్ళగుట్టదగ్గరగా, ఎప్పుడు చనిపోయిందో, ఏమో ఓ కాకి చచ్చిపడివుంది. తమ హృదయంలోని బాధనూ, ప్రేమనూ తెలపటం కోసమో నేమో నరసంతతికి—అసంఖ్యాకంగావున్న కాకిమూక అదే పనిగా విలపిస్తున్నది. ఉత్త కాకిగోల!

సూర్యుడు నల్లచీరతో కళ్ళు తుడుచుకోబోతున్నాడు. ఇంకా జగన్నాథం, వాళ్ళూ రాలేదు.

కలుషాత్ముని గుండెలోని ద్రోహచింతనలాంటి చీకటి, వెలుగును కబళిస్తున్నది. ఇంకా జగన్నాథం రాలేదు.

పార్వతమ్మకు ఆత్రుత ఎక్కువైంది. లేచి, వేసీవేయని అడుగులతో లోగిలిదాటి వీధిదాకా వచ్చింది.

ఎదురుగా తూలుతూ, ఎఱ్ఱగావున్న కళ్ళతో రఘు నిలబడి వున్నాడు!

ఆమె రఘును చూచింది. కాదు రఘు ఆమెను చూచాడు.

ఆమె అగడివేపు చేతులు జాచింది. అతడు ఆమెవేపు పరుగెత్తాడు.

ఆమె అతన్ని తన హృదయానికి హత్తుకున్నది. అతడు ఆమె ప్రేమలో తనను తాను లీనం చేసుకున్నాడు.

అంతవరకూ కన్నీరు కార్చని రఘు, పార్వతమ్మనుమాసి దుఃఖం దాచుకోలేక, బేలగా విలపించసాగాడు. "అమ్మమ్మా!" అని, అతని గుండె గుండెల్లోంచి, గొంతులోనుంచి నోట్లోంచి 'అమ్మా!' అన్న పదమే వినిపించింది.

అతనినిచూచి ఆమె మరింత కరిగిపోయింది. తదేకంగా అతన్ని చూస్తూ, కన్నీరు కారుస్తూ, అట్టే నిల్చుని పోయింది.

ప్రపంచం చీకటి ముసుగును కప్పుకోనడానికి మరింతగా ముందుకు పురోగమిస్తున్నది. కొత్తగా కాపురానికి వచ్చిన కొందరు అనుభవశూన్యులు, జీవితమంటే తెలీనివాళ్ళు, మరణాన్ని చూచివుండనివారు, వొళ్ళు విరుచుకుంటూ, తలలో పూలు ముడుచుకొంటున్నారు.

పార్వతమ్మకు మరలమరల సరోజిని జ్ఞాపకానికి వస్తున్నది. కూతురు జ్ఞాపకానికి వచ్చినకొలదీ, రఘును సందిట పొదువుకుంటూ కుమిలిపోతున్నది.

ఆమె, అలా దుఃఖిస్తూనే ఎదుటికి తేరిపార జూచింది. జగన్నాథం, మరి కొందరితో కలిసి, మెల్లగా అడుగులు వేసుకుంటూ ఇంటికి తిరిగి వస్తున్నాడు. అతని వంటిమీద చొక్కా లేదు. మొహం నల్లగా మాడిపోయివుంది. పురుషత్వం దాదాపు తెల్ల మొహం వేసుకొనివుంది.

తమ్ముడిని ఆవిధంగా చూడలేక, త్వరత్వరగా ఆమె రఘును చేతబుచ్చుకొని ఇంట్లోకి వెళ్ళింది. కానీ అక్కడ ఎక్కువసేపు వుండలేక, తిరిగి బయటకు వచ్చి బల్లమీద కూర్చున్నది. జగన్నాథం లోపలకు వస్తూవస్తూ అక్కగారివేపు చూచాడు. అదేసమయంలో పార్వతమ్మకూడా అతనివేపు అనుకోకుండా చూచింది. ఇరువురూ వొకరికొకరు, మసకమసకగా శోకమూర్తులుగా కనిపించారు. ఇరువురూ మాట్లాడలేకపోయినా, ఆ మౌనమే ఒకరినొకరిని సంపూర్ణంగా ఎరిగించింది. ఇద్దరూ మౌనంగా వున్నారు. ఇద్దరూ మౌనంగా మాట్లాడుకున్నారు. ఇద్దరూ ఒకరి వేదన నొకరి కరిగించుకున్నారు. దుర్భరమైన ఈ జీవనయాత్ర నిక కలసి మెలసి సహాయసహకారాలతో సాగించుట అవసరమన్నట్లుగా కండ్లతోనే నిర్ణయించుకున్నారు. మౌనంలోనే భావాలకు జీవంపోశారు.

జగన్నాథం ఈమౌనం భరించలేకపోయాడు. తలవొంచుకుని గబగబా ఇంట్లోకి నడిచాడు. ఇంట్లోకి ప్రవేశించబోతున్నవాడల్లా, గుమ్మందగ్గరగా కూచుని గొంతులోని బాధను గొంతులోనే అణగార్చుకొనడానికి ప్రయత్నం చేస్తున్న రఘును చూచి, జాలి కలిసిన ఆప్యాయతతో వాడిని దగ్గరకుతీసుకుని లోపలకు నడిచాడు.

లోపల భోజనాలకు ఏర్పాట్లుజరుగుతున్నాయి.

* * * *

సూర్యుడి అస్తమయానికి సంతాపసూచకంగా ప్రకృతి నల్లనిదుస్తులను తొడుక్కున్నది. జీవులకు శాంతి కలగాలని ప్రార్థిస్తున్నట్లుగా దేవుడిగుళ్లో గంటలు మ్రోగుతున్నాయి. అమావాస్యచీకటి కాకపోయినా, స్వైరిణిలాంటి చీకటి చిత్తమొచ్చినట్లు నర్తిస్తూనే వున్నది.

జగన్నాథం భోజనంచేసి బయటకు వచ్చాడు.

ఇంకా పార్వతమ్మ అలాగే బల్లచివర దిగులుగా కూచున్నది. శూన్యదృక్కులతో ఎదుటగా, అనంతంగావున్న అంధకారంలోకి చూస్తూ కూర్చున్నది.

తండ్రి వెనుకాతల వస్తున్న రఘు పార్వతమ్మను చూసి, ఆమె దగ్గరకుపోయి ఆమెకు దగ్గరగా మరీదగ్గరగా ఆనుకుని కూచున్నాడు.

పార్వతమ్మ ఆపిల్లవాణ్ణి దగ్గరకు లాక్కున్నది. వాడి జుట్టులోకి వ్రేళ్లుపోనిచ్చి దీవిస్తూ, లాలిస్తూ కూచున్నది.

జగన్నాథం, బల్లకుదగ్గరగావచ్చి, పార్వతమ్మకు ఏదో చెప్పబోయాడు. కానీ ఏంచెప్పాలో తోచక, పిల్లవాణ్ని ఒక్కసారి ముద్దుపెట్టుకుని, తిరిగి మౌనంగా మెల్లదాకావచ్చి అక్కడె చతికిలబడ్డాడు. అతనికి భవిష్యత్తేమిటో .అనూహ్యంగా వున్నది. పార్వతమ్మకు భవిష్యత్తంటే భయంగావున్నది. పిల్లవాడికి, జరుగుతున్న విషాదాంతమైన ఈకథ ఎందుకిట్లా సాగుతున్నదో అర్థంకావడంలేదు.

వారిదృష్టిలో ఇంకా సరోజిని బ్రతికే వున్నది.

అందుకనే ముగ్గురూ ఆలోచిస్తున్నారు. ముగ్గురి ఆలోచనలూ ఒకేప్రదేశంనుండి బయలుదేరుతున్నా, గమ్యస్థానాలుమాత్రం వేరు.

పసివాడైన రఘు ఎక్కువసేపు ఆలోచించలేకపోయాడు. మాటామంతీ లేకుండా ఎక్కువ సేపు కూర్చోలేకపోయాడు. చివరకు తనకు తెలియకుండానే పార్వతమ్మ మీదకు వాలి, స్వాప్నికజగత్తులో తల్లితో మాటాడడం మొదలెట్టాడు. పార్వతమ్మ పిల్లవాణ్ణి చూచింది. అతని మనోగతమైన వేదనను అర్థంచేసుకున్నది! చేసేదిలేక, మౌనాన్ని భరించలేక "తమ్ముడూ!" అని పలికి ఏంచెప్పాలో తోచక "పిల్లవాడు నిద్రపోయాడు." అని పూర్తిచేసింది. జగన్నాథం మ్లానవదనుడైనాడు. "అవును. మనబ్రతుకులే నిద్రపోతున్నాయి." అన్నాడు.

పార్వతమ్మకు సమాధానం ఏమని చెప్పాలో తోచలేదు. అయినా సమాధానం చెప్పకుండా వూరుకోవడం మంచిదికాదని "తమ్ముడూ—అధైర్యపడితే ఏం ప్రయోజనం చెప్పు! ఆ సొమ్ము మనదికాదు. అంతే. దేవతలా వెళ్లిపోయింది. ఏనాడో చేసుకున్న ఋణం అణాపైసలతోసహా తీర్చుకుని మరీ వెళ్ళిపోయింది—తమ్ముడూ! వెళ్లిపోయింది."ఆమె కంఠం రుద్ధమైంది.

"జారిపోయిన అద్దంతో మనకింకేం ప్రయోజనంరా? అంతే. మర్చిపోవాలి. తప్పదు." కొంచెంసేపు ఆగి, ధైర్యం తెచ్చుకుని తిరిగి "ఆవస్తువు మనది కానప్పుడు ఎంతని పట్టుకు ప్రాకులాడితే ఏంప్రయోజనం? అంతా పురాకృత కర్మఫలం; మననిలా కట్టికుడుపుతున్నది." అన్నది.

దీనికిగూడా అతనేమీ సమాధానం చెప్పలేదు. ఒక్క నిట్టూర్పుమాత్రం విడిచి ఊరుకొన్నాడు.

పార్వతమ్మే అన్నది, "జరిగిపోయిందానికి చింతించి ప్రయోజనం లేదుకదా! సరోజిని మనకిక లేదు. అందుకనే ముందుసంగతి చూచుకోవాలి. నువ్వు అధైర్యపడుతున్నావు. నాకు తెలుసు తమ్ముడూ! ఆడవారి అండదండలు లేకపోతే మగవాడెల్లా తెగిన గాలిపటంలాగా తయారవుతాడో నాకు తెలుసు. ఇందుకు నువ్వేమాత్రం బెంగపెట్టుకో నవసరంలేదు. ఈ మైల వెళ్లకముందే మళ్ళీ నిన్నొకయింటివాణ్ణి చేస్తాను. నామాట నమ్మ."

జగన్నాథానికి జరుగుతున్నదేమీ అర్థంకావడం లేదు. "ఈమె—ఈమె మనిషేనా! తను వింటున్నది నిజమేనా? పిల్లనిచ్చి పెళ్ళిచేసింది. తనను ఒకయింటివాణ్ణి చేసి, సంఘంలో గౌరవప్రతిష్ఠలు, ఆస్తిపాస్తులు సమకూర్చిపెట్టింది. అటువంటిది, తిరిగి ఈనాడు ఆమే తనకు రెండోపెళ్ళి చేస్తానంటున్నది. భగవంతుడా! ఏమిటి నీ మాయ?" జగన్నాథం మాట్లాడకపోవడం చూచి తిరిగీ ఆమె అన్నది. "నామాట నమ్మతమ్ముడూ మీ బావగారి పాదాలసాక్షిగా చెబుతున్నాను. ఈ పిల్లలకు ఒక ఆధారం చూపించికాని నేను నిద్రపోను. నన్ను నమ్మ."

జగన్నాథానికి ఏం మాట్లాడాలో తోచలేదు. కృతజ్ఞతాభారంతో అతని తల వొంగిపోయింది. శ్వాస బరువుగా వదుల్తూ" అ...క్క...య్యా!" అని మాత్రం అనగలిగాడు.

చుట్టముట్టించుకొనడానికని అగ్గిపుల్ల వెల్గించిన సమయంలో—అంత ధైర్యంగా మాటాడగల్గుతున్న అక్కగారిని ఒక్కసారి చూద్దామనుకున్నాడు. అందుకే అటువేపు చూశాడు.

పార్వతమ్మ కళ్లనుండి ధారాపాతంగా నీళ్ళు కారిపోతున్నవి. ఆపిల్లవాడు "అమ్మా! అమ్మా!" అంటూ మెల్లగా కలవరిస్తున్నాడు.

జగన్నాథం ఆదృశ్యం చూడలేక తల వీధివైపుకు త్రిప్పుకున్నాడు. ఎవరో తన ముగ్గురు పిల్ల

లను తీసుకుని తనవైపే నడిచివస్తున్నారు. పసిపిల్ల కేరింతాలు కొడుతూ, ఆ ఆగంతుకురాలి చంకలో ఆడుకుంటున్నది. రాముడూ, కమలాగూడా నవ్వు మొగాలతోనే వున్నట్లున్నారు.

జగన్నాథం ప్రేమగా వాళ్లినందుకోబోయాడు. పసిపిల్ల అతని చేతుల్లోకి రాక తనను ఎత్తుకు వచ్చిన ఆమె సందిట్లోకి ఇమిడిపోయింది. రాముడు బిక్కు బిక్కుమంటూ తండ్రిని చూసి భయపడ్డట్లుగా దూరంగా తొలగి నిల్చున్నాడు. కమల, ఇంటెని సమీపిస్తూనే పార్వతమ్మదగ్గరకు పరుగెత్తుకుపోయింది.

జగన్నాధానికి చైతన్య రహితంగా వున్న ప్రకృతిలో చైతన్యం కనిపిస్తున్నది. మరణించిన సరోజిని క్రొత్త రూపంతో ప్రత్యక్షమౌతున్నది. అయ్యో! సరోజినీ! ఆకాశంనుండి నక్షత్రమొకటి రాలిపోయినా అప్పుడప్పుడే ఉదయిస్తున్న చంద్రుడు, అదేమీ గమనించకుండా ప్రశాంతతను సూచించడం కన్పిస్తున్నది. ఏటిపైనుండి వీస్తున్న చల్లని గాలి, దూర తీరాలనుండి ఆశలనూ, ఆనందాలనూ తెస్తున్నట్లుతోచింది. దానితో భయంకరంగా వున్న భవిష్యత్తులోకి దొంగచాటుగా చూస్తూ కళ్ళుమూసుకున్నాడు జగన్నాథం. కళ్ళు మూసుకుని మనసులోనే పార్వతమ్మకు హృదయ పూర్వకంగా నమస్కరించాడు. నమస్కరిస్తూనే, తన కళ్ళలో నవ్వుతున్నట్లుగా మెదుల్తున్న నలుగురు బిడ్డల తల్లి సరోజినిని కొంచెం ఆవలకునెట్టి, ఆశూన్య ప్రదేశంలో, తనకు తెలియరాని, తనుచూడలేని ఓ మూర్తిని ప్రతిష్ఠించుకున్నాడు.

వేటూరి—

సుందరశాస్త్రిగారి

సువర్ణ సుందర రసము

సర్వమేహములకుసంజీవి.

గుణము ప్రత్యేకము

అనుభవసిద్ధము. ఇంజెక్షన్లు అవసరం లేదు. ఎటువంటి సవామేహాలనైనా కుదుర్చును.

50 మాత్రలు రు. 5.

ఆర్షరసాయనశాల, ముక్త్యాల

భారతి సచిత్ర మాసపత్రిక

ప్రకటన రేట్లు

కవరు పేజీలు

4 వ కవరు పేజి	కాజువల్	కంట్రాక్టు
2 లేక 3 రంగులు	రు. 125/-	రు. 100/-
2 లేక 3 వ కవరు పేజి		
ఒకే (నలుపు) రంగు	90/-	75/-
లోపలి పేజీలు		
పూర్తి పేజి	70/-	60/-
అర్థ పేజి	35/-	30/-
పావు పేజి	20/-	15/-

ప్రత్యేక స్థానములకు 25% అదనం.

సం॥నకు వరుసగా 12 ప్రకటనలు చేయువారికే కాంట్రాక్టు రేట్లు వర్తించును.

* కవులు, కళాకారులు, రచయితలు మొదలైన వారి ప్రకటనలు ఒక కాలం ఇంచికి లేపకు రు. 2/- చొప్పున ప్రకటించబడును.

మేనేజరు, భారతి,
మద్రాసు-1.